# ఆదిలాబాద్ వార్త



అదిలాబాద్, మంచిర్యాల, అసిఫాబాద్, నిర్మల్,

గురువారం 25, మే 2023 8 పేజీలు


## ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరైన మంత్రి



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో రూ.40 లక్షల దేవాదాయశాఖ నిధులతో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సతీసమేతంగా హాజరై పూజలు చేశారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి





- రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త :** రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా ప్రభుత్వం చేపట్టిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల కార్పోరేషన్ చైర్మెన్ రవీంధర్‌సింగ్, మేనేజింగ్ డైరెక్టర్ వి.అనిల్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

## మండుతున్న ఎండలు జంకుతున్న.. ప్రజలు

వివరాలు 2 లో..



**ముధోల్, ప్రభాతవార్త :** ముధోల్ నియోజకవర్గంలో అన్ని మండలాల ప్రజలు మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగాయి. మధ్యాహ్నం వేళ ఎండలు మండిపోతున్నాయి. ఎండవేడికి ప్రజలు పగటివేళల్లో బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే భైంసా రహదారులు, ఎండ తీవ్రత అధికం కావడంతో వాహనాల రాకపోకలు అంతంతమాత్రంగానే ఉంటోంది. తప్పనిసరి అత్యవసర పరిస్థితుల వల్ల ఎండలో బయటకు వెళ్తున్న ప్రజలు దాహార్తిని తీర్చుకోవ డానికి ఇబ్బందు లను ఎదు ర్కొంటున్నారు.

## మిషన్ భగీరథ నీళ్లు ఎక్కడ..?





-మంచినీటి కోసం గ్రామస్తులు -అవస్థలు పట్టించుకోని అధికారులు

**ఆదిలాబాద్, ప్రభాతవార్త:** ఇంటింటికీ నీళ్లు సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంటే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. గుక్కెడు నీటి కోసం మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. తలమడుగు మండలంలోని లచ్చంపూర్ గ్రామంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి మిషన్ భగీరథ పైపుల నుంచి నీళ్లు రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## నిర్మల్ వైద్య కళాశాలలో.... ప్రారంభమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల జాయినింగ్ ప్రక్రియ

రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి




**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాలకు 22 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు గాను ఇప్పటి వరకు 21 మంది నిర్మల్ జిల్లా వైద్య కళాశాలలో అప్లై చేసు కున్నారని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జాయినింగ్‌కు నెల గడువు విధిం చిన వైద్య ఆరోగ్యశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు శుభా కాంక్షలు తెలిపిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తాజాగా ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియా మకంతో కొత్తగా ఏర్పడ్డ నిర్మల్ మెడికల్ కాలేజీలో ఆయా విభాగాల్లో అందించే వైద్య సేవలు మరింత మెరుగు కానున్నాయని మంత్రి తెలిపారు.

2 లో..

## అభివృద్ధి పనులను.... వేగవంతం చేయాలి

వివరాలు 2 లో..

... జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో ,ప్రభాతవార్త :** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు సమ్వ యంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు.

# మండుతున్న ఎండలు, జంకుతున్న ప్రజలు

ముధోల్, ప్రభాతవార్త :

**మొదటిపేజి తరువాయి :** ముధోల్ నియోజకవర్గంలో అన్ని మండలాల ప్రజలు మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగాయి. మధ్యాహ్నం వేళ ఎండలు మండిపోతున్నాయి. ఎండవేడికి ప్రజలు పగటివేళల్లో బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉండే భైంసా రహదారులు, ఎండ తీవ్రత అధికం కావడంతో వాహనాల రాకపోకలు అంతంతమాత్రంగానే ఉంటోంది. తప్పనిసరి అత్యవసర పరిస్థితుల వల్ల ఎండలో బయటకు వెళ్తున్న ప్రజలు దాహార్తిని తీర్చుకోవడానికి ఇబ్బందులను ఎదు ర్కొంటు న్నారు. గత సంవత్సరం పోలిస్తే ముధోల్ నియోజకవర్గంలో చలివేంద్రాల సంఖ్య తగ్గింది. దీనివల్ల ప్రజలు పదుల రూపాయలు వెచ్చించి తాగునీటి బాటిళ్లను కొనుగోలు చేయాల్సి వస్తోందని అంటున్నారు. కూలీ పనులకు వెళ్తున్న దినసరి కూలీలు, ఇతర అవసరాలకు బయటకు వెళ్తున్నవారు ఎండవేడి వల్ల తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. అత్యవసరం అయితే తప్పా బయటకు రావడం లేదు.... ముధోల్ నియోజకవర్గంలో ముధోల్, భైంసా, కుభీర్, తానూర్, కుంటాల, బాసర, బస్టాండ్ పరిసర ప్రాంతాలు నిత్యం రద్దీగా ఉంటాయి. అయితే ఎండ తీవ్రత వల్ల వాహనాల తాకిడి తగ్గిపోయింది. ఎండ వేడిమికి ప్రజలు భయంతో ముఖ్యమైన పనులు ఉంటే తప్పా పగటి వేళ బయటకు రావడం లేదు. ఇదే సందర్భంలో శీతల పానియాల విక్రయ కేంద్రాలకు మంచి ఆదాయం సమకూరుతోంది. వివిధ పనుల కోసం బయటకు వచ్చేవారు, దప్పిక తీర్చుకోవడానికి శీతల పానియాలు, పళ్ల రసాలను సేవిస్తున్నారు. చలివేంద్రాల సంఖ్య తక్కువ కావడంతో వీటిని తాగడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో పట్టణ శీతల పానియాల సంఖ్య పెరిగింది. అయితే అధికశాతం శీతల పానియాలు సేవిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఎండలో బయటకు వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను సలహాలను, సూచనలను నిపుణులు అందిస్తున్నారు. అంతేకాకుండా తప్పనిసరి పరిస్థితుల్లో ఎండకు వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వీటివల్ల ఎండ వేడి నుంచి ఉపశమనం కలగడమే కాకుండా వడదెబ్బకు గురికాకుండా ఉండవచ్చని అంటున్నారు.

**ఎండకు వెళ్లినప్పుడు చేయాల్సినవి....**

ఎండలు పెరుగుతున్న తరుణంలో నిత్యావసరాలకు, ఇతర పనులకు ఉదయం, సాయంత్రం వేళ బయటకు వెళ్లాలని సలహాలు అందిస్తున్నారు. వీలైనంత వరకు పనులను ఎండ తక్కువ ఉన్న సమయాలకు వాయిదా వేసుకోవడం మంచిదని నిపుణులు అంటున్నారు. ఎండతీవ్రత తక్కువగా ఉన్న సమయంలో బయటకు రావాలని, ఒకవేళ ఎండలో తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, కాటన్‌తో తయారుచేసిన తెల్లని వస్త్రాలు ధరించాలని సూచిస్తున్నారు. ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వచ్చినప్పుడు జాగ్రత్త అవసరమని వివరిస్తున్నారు. నీరు ఎక్కువగా తీసుకోవాలని, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, మజ్జిగ, వంటివి తాగాలని, వీటివల్ల ఎండదెబ్బ తగలకుండా ఉంటుందన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త

**మొదటిపేజి తరువాయి :** రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా ప్రభుత్వం చేపట్టిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల కార్పోరేషన్ చైర్మెన్ రవీంధర్‌సింగ్, మేనేజింగ్ డైరెక్టర్ వి.అనిల్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రి ధాన్యం కొనుగోళ్లు దాదాపుగా చివరి దశకు చేరుకున్న తరుణంలో క్షేత్రస్థాయిలో ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని, రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం ఈసారి ముందస్తుగా ఏప్రిల్ 10వ తేది నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని, ఇప్పటి వరకు 4.55 లక్షల మంది రైతుల వద్ద నుంచి 28.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే 15 రోజుల్లో మిగతా ధాన్యం అంతా కొనుగోలు చేయడంపై జిల్లా కలెక్టర్లు దృష్టి సారించాలని, అత్యవసర పరిస్థితులలో ఇంటర్మీడియట్ గోదాములను వినియోగించు కోవాలని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసు కోవాలని తెలిపారు. రైస్ మిల్లులు, ఇంటర్మీడియట్ గోదాముల విషయంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే పొరుగున ఉన్న జిల్లా కలెక్టర్ల సహాయం తీసుకుని ధాన్యం కొనుగోలులో ఎలాంటి అవాంతరాలు జరుగకుండా చూడాలనితెలిపారు. సరిహద్దు జిల్లాల కలెక్టర్లు పక్క రాష్ట్రం నుంచి ఎటువంటి ధాన్యం మన కేంద్రాలకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రాష్ట్రంలోనఇ ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. ధాన్యం దిగుబడులకు అనుగుణంగా అదనంగా 400 కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందని, అకాల వర్షాల కారణంగా రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తూ రైతుల సంక్షేమానికి కృషిచేస్తుందని, 21 శాతం తేమ కలిగిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాలు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల పాలకవర్గాల తోడ్పాటుతో పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలను కొనుగోలు చేయడం సాధ్యపడిందని అభినందించారు.



రైతుల నుంచి ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేస్తూ వాటిని భద్రపరిచేందుకు వీలుగా అవసరమైన చోట గిడ్డంగులను గుర్తించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యానికి తరుగు తీయకఉండా రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందేలా పర్యవేక్షించాలని ధాన్యం రవాణాకు ఆటంకాలు లేకుండా అదనపు వాహనాలను సమకూర్చుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 85 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయిందని, సంబంధిత ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు ట్యాగ్ చేయడం జరిగిందని, రైస్ మిల్లులలో తగినంత స్థలం లేనిపక్షంలో ధాన్యాన్ని ఇంటర్మీడియట్ గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా ఉందని, కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.మధుసూదన్ నాయక్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి దాసరి వేణు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎ.ప్రేమ్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో ,ప్రభాతవార్త

జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా సంబంధిత అధికారులు సమ్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. బుధవారి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు, ఉప కేంద్రాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, మన ఊరు మనబడి పనులపై ఇంజనీరింగ్, విద్యాశాఖ శిశు సంక్షేమశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల నిర్ధేశిత లక్ష్యాన్ని త్వరితగతిన సాధించే విధంగా అధికారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లాలో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు, సిబ్బంది క్వార్టర్లు నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా అధికారులు దృష్టి సారించాలని, ఉప కేంద్రాల భవనాలు, ప్రహారిగోడ నిర్మాణము పునులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ పనులు, మరమ్మతులను పూర్తి చేసి వినియోగం లోకి తీసుకువచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా సిద్ధం చేయాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన మరమ్మత్తులు, త్రాగునీరు, మూత్రశాలలు, సౌచాలయాలు, డ్యూయల్ బెంచీలు, ఇతర సంబంధిత పనులను పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయానలి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, సంక్షేమశాఖ అధికారి సావిత్రి ఈఈలు,డీఈలు, ఇంజనీరింగ్ అధికారులు మండల విద్యాధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరైన మంత్రి

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :



**మొదటిపేజి తరువాయి :** బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో రూ.40 లక్షల దేవాదాయశాఖ నిధులతో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సతీసమేతంగా హాజరై పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి దంపతులు యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయాలకు పెద్దపీట వేస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. 1200 కోట్లతో యాదాద్రి ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ప్రతీ ఊరిలో కొత్తపాత ఆలయాలకు నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## నిర్మల్ వైద్య కళాశాలలో ప్రారంభమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల జాయినింగ్ ప్రక్రియ

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :



**మొదటిపేజి తరువాయి :** నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలకఉ వివిధ విభాగాలకు 22 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు గాను ఇప్పటి వరకు 21 మంది నిర్మల్ జిల్లా వైద్య కళాశాలలో ఆప్ట్ చేసుకున్నారని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జాయినింగ్‌కు నెల గడువు విధించిన వైద్య ఆరోగ్యశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్లకఉ శుభాకాంక్షలు తెలిపి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తాజాగా ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంతో కొత్తగా ఏర్పడ్డ నిర్మల్ మెడికల్ కాలేజీలో ఆయా విభాగాల్లో అందించే వైద్య సేవలు మరింత మెరుగుకానున్నాయని మంత్రి తెలిపారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటుచేయాలన్న సీఎం కేసీఆర్ నిర్ణయంతో రాష్ట్రంలో వైద్య విద్య అవకాశాలు పెరిగి, సూపర్ స్పెషాలిటి సేవలు మారుమూల ప్రాంతానికి సైతం చేరువ అయ్యాయని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

## మిషన్ భగీరథ నీళ్లు ఎక్కడ..!

ఆదిలాబాద్, ప్రభాతవార్త:

**మొదటిపేజి తరువాయి :** ఇంటింటికీ నీళ్ల సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంటే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. గుక్కెడు నీటి కోసం మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. తలమడుగు మండలంలోని లచ్చంపూర్ గ్రామంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. గత రెండు, మూడు సంవత్సరాల నుంచి మిషన్ భగీరథ పైపుల నుంచి నీళ్లు రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో మంచినీళ్లు కోసం నానా తంటాలు పడుతున్నారు. గ్రామంలో ఉన్న రెండు చేతి పంపులు సరిగ్గా నీళ్లు రావడం లేదు. అయితే ఇటీవల స్థానిక సర్పంచ్ ముల్కల రాజేశ్వర్ గ్రామపంచాయతీ నిధుల నుంచి గ్రామంలో ఒక బోరును నడిపిస్తున్నారు. కానీ ప్రతిసారి ఆరు నెలలకు ఒకసారి ఆ బోరు నిరుపయోగంగా మారుతుంది. దీంతో గ్రామస్తులు మంచినీళ్లు కోసం అవస్థలు పడుతున్నారు. ప్రతిసారి సర్పంచ్ రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు డబ్బులు పెట్టుకొని చేయించిన మళ్లీ ఆరు నెలలకు ఇదే పరిస్థితి వస్తుంది. మా గ్రామంలో మిషన్ భగీరథ తీసుకురావాలని సర్పంచ్ ముల్కల గంగమ్మ రాజేశ్వర్, గ్రామస్తులు ఏఈ ఎస్‌సీని జిల్లా అధికారులకు కలిసి మొర పెట్టుకున్నారు. కానీ ప్రతిసారి అధికారులు మూడు నెలల్లో మీ పని పూర్తి చేస్తామని చెప్పడమే తప్పా రెండు సంవత్సరాలు అవుతున్న పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లకు డబ్బులు పెట్టి ఉత్త చేతులు అవ్వడమే తప్ప ఇప్పటి వరకు బోర్లకు పెట్టిన డబ్బులు రాలేదని స్థానిక సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

# పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభించకుంటే ఆందోళన

*నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :*



పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని భారతదేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి ఆదివాసి ముద్దుబిడ్డ ద్రౌపది ముర్ము చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశ అత్యున్నతమైన పార్లమెంట్ భవనాన్ని దేశ ప్రజల సహాయ సహకారాలతోనే నిర్మాణం జరిగిందని, అట్టి భవన ప్రారంభోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఎలాంటి అర్హత లేదని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన 85వ ఆర్టికల్ ప్రకారం అధి రాష్ట్రపతికే ప్రారంభోత్సవ అర్హత దక్కుతుందని అన్నారు. ఆదివాసి మహిళ అని అవమానపరిచేవిధంగా చేస్తే సహించబోమని రాష్ట్రపతి ప్రారంభించాలని, లేనియెడల ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. రాష్ట్రపతి అనివార్య కారణాల వల్ల లేనియెడల, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసే అధికారం ఉంటుందని అన్నారు. దేశవ్యాప్తంగా 30 కోట్ల ఆదివాసిలను అవమాన పరిచినట్లేనని, ఆదివాసులంటే బీజేపీ నాయకులకు చులకనగా కనిపిస్తుందని అన్నారు.

## టిబి(క్షయ) వ్యాధి నివారణకై అవగాహన ర్యాలీ

*నిర్మల్ కలెక్టరేట్, ప్రభాతవార్త :*



టీబీ(క్షయ) వ్యాధి నివారణకు అవసరమైన చర్యలు తీసుకుని అందరి భాగస్వామ్యంతో ముందుకెళ్దామని టీబీ సూపర్‌వైజర్ లాలయ్య, స్థానిక సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్ అన్నారు. బుధవారం ముధోల్ మండల ఆసుపత్రి వద్ద టీబీపై వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, వైద్యాధికారి ఆదేశాల ప్రకారం ప్రతీనెల 24వ తేదిన క్షయ దివస్‌ను జరుపుతూ క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో చైతన్యం తీసుకురావాలని అన్నారు. టిబిని నివారించాలంటే తగు లక్షణాలున్న వ్యాధిగ్రస్తులు పరీక్ష చేసుకుని క్రమం తప్పకుండా మందులు తీసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అదేవిధంగా చికిత్స సమయంలో వ్యాధి గ్రస్తునికి ప్రతీనెల 500 రూపాయలు సైతం అందించడం జరుగుతుందని వెల్లడించారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం 2025 సంవత్సరం వరకు టిబి నివారణకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు ఆకాష్, సాయి సువర్ధన్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

*తొర్రూరు రూరల్, మే24, ప్రభాతవార్త*

డివిజన్‌లోని ప్రజలందరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా అంబేద్కర్ నగర్‌లో మురికి కాల్వలను, పిచ్చిచెట్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిశుభ్రత వాతావరణంలో వ్యాదులు ప్రబలుతాయని, ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాదులకు దూరంగా ఉండవచ్చన్నారు. ప్రతి ఒక్కరు ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌లను వినియోగించుకోవాలన్నారు. తమ ఇంట్లో ఉన్న పనికిరాని వస్తువులను మున్సిపాలిటి సెంటర్‌లో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ పట్టాబి జవాన్, రాజశేఖర్, సిబ్బంది ఉప్పలయ్య, నల్ల ఉప్పలయ్య, అశోక్, హరీష్, ప్రభాకర్, లక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విత్తన కంపెనీ నుండి నష్టపరిహారం ఇప్పించాలి

*తొర్రూరు రూరల్, మే 24, ప్రభాతవార్త*

మా విత్తన కంపెనీ నుండి విత్తనాలు వాడితే అధిక దిగుబడి వస్తుందని చెప్పి తీరా పంట వేసాక పూత, కాత లేక నష్టపోయిన కురవి మండలం గాజ్యతండా పంచాయతీ పరిధిలోని టేకుల తండాకు చెందిన మిరప రైతు ధరంసోత్ చందులాల్ డివిజన్‌కేంద్రంలోని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఇంచార్జ్ వింజమూరి సుధాకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ.. శ్రీలక్ష్మి ఫెస్టిసైడ్స్ సంస్థకు చెందిన మిరప విత్తనాలు కొనుగోలు చేసి మూడు ఏకరాలలో మిరప పంట వేశానని దిగుబడి బాగా రావాలని రూ.5లక్షల మేర పెట్టుబడి పెట్టానని వారి మాటలు నమ్మి ఆర్థికంగా నష్టపోయానని పెర్కొన్నారు. మోసపూరిత ఆశ చూపి నకిలీ విత్తనాలు అంటగట్టిన కంపెనీపై చర్యలు తీసుకొని నష్టపరిహారం కింద రూ.25లక్షలు అందించాలని కోరారు. మిరప పంట కంపెనీకి నోటీసులు పంపి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని డిసిఐసి ఇంచార్జ్ సుధాకర్ రైతుకు హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిఐసి డైరెక్టర్ షేక్ జాని తదితరులు ఉన్నారు.

## ఘనంగా విగ్రహ శిఖర ప్రతిష్టాపన

*ఉట్నూర్,ప్రభాతవార్త:*





ఉట్నూర్ మండలంలోని సాకెర (జేమ్లానాయక్) తాండాలో శ్రీ జగదాంద మాత శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ రామారావు మహారాజ్ నూతనంగా నిర్మించిన మందిరంలో బుధవారం విగ్రహ శిఖర ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో హాజరై ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ ప్రత్యేక పూజలు చేశారు.బంజారా కాశి పౌరాదేవి పీఠాధిపతి దేవి భక్త శేఖర్ మహారాజ్ జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ ప్రత్యేకంగా ఆశీర్వదించారు. అనంతరం జడ్పీ చైర్మన్ మాట్లాడారు. ఇంత పవిత్రమైటువంటి మందిరం ప్రతిష్టాపన చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సుమన్ రాథోడ్, స్థానిక సర్పంచ్ ఆడే రమేశ్, రాథోడ్ వికాస్ నాయక్, ప్రకాష్ టీచర్ పాల్గొన్నారు.

## రైతుబంధు ద్వారానే పేదలకు లబ్ధి

**ఎమ్మెల్యే రెడ్యానాయక్**

*దంతాలపల్లి, మే24, ప్రభాతవార్త*



గ్రామీణ నిరుపేద రైతులకు రైతుబంధు ద్వారా లబ్ధిచేకూరుతుందని డోర్నకల్ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని దొనకొండ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. గతంలో రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితి ఉన్న సమయంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారిలో చైతన్యాన్ని నింపాడన్నారు. అలాగే గ్రామాల్లో నిటిఎద్దడి పెరుకపోయినందున మిషన్ భగీరథ పథకంతో ప్రతి ఇంటికి నీరందిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. అలాగే నియోజకవర్గంలో పేదలందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తద్వారా వారందరు బిఆర్ఎస్ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పివైస్‌చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపిపి ఓలాద్రి ఉమమల్లారెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు ధర్మారపు వేణు, సొసైటి చైర్మన్ సంపెట రాము, ఆగయ్య, లింగన్న, ఎంపిడివో విజయలక్ష్మి, ఎమ్మార్వో శివాని, ఎస్సై జగదీష్, కార్యదర్శి రమేష్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ వార్త

## ఆమ్ ఆద్మీపార్టీ ఆధ్వర్యంలో యువకులకు క్రికెట్ కిట్ అందజేత

*నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :*



యువకుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ హైదర్ శాంతినగర్‌కు చెందిన యువకులకు బుధవారం రోజు క్రికెట్ కిట్‌ను పంపిణీ చేశామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, దానిని వెలికితీసేందు కోసం ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో వారికి ఆటల పోటీల్లో సందర్భంగా క్రికెట్ కిట్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా వారిలో ఐక్యత, స్నేహభావం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమలో పార్టీ నిర్మల్ టౌన్ కోఆర్డినేటర్ రవీంధర్, కో కోఆర్డినేటర్ తబ్రేజ్, ప్రధాన కార్యదర్శి సాయికుమార్, కార్యదర్శి యాసిన్ అల్తాఫ్ లాలా, హజార్, నిర్మల్‌టౌన్ మైనార్టీ సెల్ కోఆర్డినేటర్ ఫైసల్‌బిగ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మినారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



*లోకేశ్వరం, ప్రభాతవార్త :*

నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం బాగాపూర్ శివారులో గల లక్ష్మి నారాయణ స్వామి దేవాల యంలో ఆలయ పూజారి నరసింహస్వామి జన్మదినం సందర్భంగా లక్ష్మినారాయణ స్వామికి పంచోపనిషత్తులతో స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అష్టోత్తరపూజ, అర్చనపూజ, సామూహిక సత్యనారాయణ వ్రత పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రత్యేక ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఆలయానికి వచ్చిన కొందరు పెళ్లిరోజు, పుట్టిన రోజు సందర్భంగా లక్ష్మినర్సింహస్వామి సేవలో అర్చన, అభిషేకం లాంటివి మాత్రమే జరుపుకోవాలని, హిందూ సాంప్రదాయాలను కాపాడాలని, దీపాలను వెలిగించాలని ఈసందర్భంగా ఆలయ పూజారి నర్సింహస్వామి తెలియజేశారు.

## తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టొద్దు : మంత్రి సత్యవతి రాథోడ్

*నెల్లికుదురు, మే 24, ప్రభాతవార్త*



తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని, రైతులు పండించిన ప్రతి దాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆదైర్యపడొద్దని రాష్ట్ర గిరిజన,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నాడు. బుధవారం మండలంలోని శ్రీరామగిరిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మంత్రి మాట్లాడి సమస్యలను గురించి తెలుసుకున్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని నిర్వహాకులకు సూచించారు. తడిసిన ధాన్యాన్నిసైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డిసిఓ ఖుర్షిద్,రైతులు పాల్గొన్నారు.

# ఎంపిడిఓ, సీనియర్ అసిస్టెంట్ మధ్య వార్ - ఎంపిపి ఫైర్

**పాలకుర్తి, ప్రభాతవార్త.**

పాలకుర్తి ఎంపిడిఓ కార్యాలయంలో సిబ్బంది మధ్య తలెత్తిన అభిప్రాయ బేధాలు ముదిరి పాకాన పడ్డాయి. గత కొన్ని నెలల నుంచి చాప కింద నీరులా ఉన్న అభిప్రాయ బేధాలు శృతి మించడంతో తెరకెక్కాయి. ఎంపిడిఓ, సీనియర్ అసిస్టెంట్‌కు మధ్య నడుస్తున్న ప్రచ్ఛన్న యుద్ధం బహిర్గతమయ్యాయి. దీంతో ఎంపిపి అనసూయ రాంరెడ్డి ఎంపిడిఓను పద్ధతి మార్చుకోవాలని, కలిసి కట్టుగా అభివృద్ధిపైన దృష్టి సారించాలని హెచ్చరించడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గత కొన్ని నెలల క్రితం ఎంపిడిఓగా వచ్చిన లలితకు అదే కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ దాడి శ్రీనివాస్‌కు మధ్య అభిప్రాయ బేధాలు వచ్చాయి. తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం శ్రీనివాస్ ఇటీవల లీవ్‌లో వెళ్లారు. లీవ్‌లో వెళ్లే ముందు ఎంపిడిఓకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నం చేశారు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తన తోటి సిబ్బంది ద్వారా ఎంపిడిఓకు సమాచారాన్ని అందించారు. లీవ్ ముగిసిన తరువాత ఇటీవల తన విధులకు యథావిధిగా వచ్చారు. జాయినింగ్ లెటర్ ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. ఈ అభిప్రాయ బేధాలతో ఆఫీస్‌లో సిబ్బంది గ్రూప్‌లుగా విడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లీవ్‌లో వెళ్లడం తన ప్రాథమిక హక్కు అయినప్పటికీ ఎంపిడిఓ తనను ఉద్దేశ పూర్వకంగానే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తన అధికారుల వద్ద, తోటి సిబ్బంది వద్ద వాపోతున్నారు. ఇదే విషయాన్ని ఆయన మంగళవారం ఎంపిపి వ్యాళ్ల అనసూయ రాంరెడ్డి దృష్టికి తీసుకుపోయారు. దీంతో ఎంపిపి వ్యాళ్ల అనసూయ రాంరెడ్డి ఎంపిడిఓ పైన తన అసంతృప్తి వ్యక్తం చేశారు. కలిసి పని చేయాల్సింది పోయి తగాదాలు పెట్టుకోవడం ఎంత వరకు సమంజసమని ఎంపిడిఓను ప్రశ్నించారు. ఎంపిడిఓ కార్యాలయంపై తనకు కొన్ని నెలల నుంచి పలు ఆరోపణలు వినపడుతున్నాయని, అటు ఎంబి రికార్డుల పేరుతో, ఇటు పెన్షన్ల పేరుతో ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నట్లు సర్పంచ్‌లు తన దృష్టికి తీసుకు వచ్చారని ఎంపిపి అనసూయ రాంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో తాను మరో సమావేశాన్ని ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో అన్ని విషయాలపై రివ్యూ నిర్వహిస్తానని అన్నారు. ఇప్పటికైనా ప్రజల సంక్షేమం, అభివృద్ధిపైన దృష్టి పెట్టి పని చేయాలని ఆమె వారిని హెచ్చరించారు.

# అక్రమంగా తరలిస్తున్న మట్టి లారీలను అడ్డుకున్న గ్రామస్తులు

**పెద్దపల్లి, ప్రభాతవార్త.**



పెద్దపల్లి మండలం రాఘవాపూర్ నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను రంగాపూర్ క్రాస్ రోడ్డు వద్ద రాఘవాపూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. రాఘవాపూర్ నుంచి మట్టి అక్రమ రవాణాపై గత పది రోజులుగా రాఘవాపూర్ గ్రామస్తులు జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో మంగళవారం గ్రామ పంచాయతీ వద్ద సమావేశమైన గ్రామస్తులు అక్రమ మట్టి రవాణాపై గ్రామ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీలను ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో తిరిగి బుధవారం జిల్లా మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి నేరుగా వెళ్లి మట్టిని తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. రాఘవాపూర్ గ్రామ శివారు నుంచి వందలాది టిప్పర్ల ద్వారా రంగాపనూర్ మీదుగా సబితం, రాఘవాపూర్ శివారులో ఉన్న ఇటుక బట్టీలకు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఎస్ఆర్ఎస్‌పి కెనాల్ మీదుగా పెద్దపల్లి-మంథని రహదారిని కలిసే చోట రాఘవాపూర్ గ్రామస్తులు మట్టి టిప్పర్లను అడ్డుకొని అధికారులకు సమాచారం అందించారు. గ్రామస్తులకు ప్రజాహిత వేదిక నాయకులు సంఘీభావం తెలిపారు. మైనింగ్, ట్రాన్స్‌పోర్టు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌పోర్టు విజిలెన్స్ అధికారి ఫారూక్ మాట్లాడుతూ రాఘవాపూర్ గ్రామస్తులు పట్టుకున్న వాహనాలకు సంబంధించిన పేపర్స్ పరిశీలించి, బరువు, తూకం వేయించి, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజాహిత వేదిక నాయకులు, సీనియర్ న్యాయవాది సి.సత్యనారాయణ రెడ్డి, ఓదెల జడ్పీటీసీ గంట రాములు మాట్లాడుతూ చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్న రాఘవాపూర్ గ్రామస్తులను అభినందించారు. అక్రమ మట్టి దందాపై గత పది రోజులుగా అధికారులకు ఫిర్యాదు చేస్తూ బుధవారం వాహనాలను అడ్డుకోవడం అభినందనీయమని అన్నారు. అక్రమ మట్టి దందా వెనుక స్థానిక ఎమ్మెల్యే హస్తమున్నదని వారు ఆరోపించారు. రాఘవాపూర్ గ్రామస్తులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు స్పందించకపోవడం పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. ఇంత బహిరంగంగా సహజ వనరులను అక్రమంగా తరలిస్తున్న, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందని స్పష్టమవుతుందని అన్నారు. సహజ వనరులను రక్షించాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేపై ఉందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టుకున్న టిప్పర్లను పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పర్యావరణ హితమైన కార్యక్రమాలు చేపడుతున్న సింగరేణి

**- సింగరేణి ఆర్జీ 2**

**జిఎంఎ.మనోహర్**


**యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త.**



సింగరేణి పర్యావరణ హితమైన అనేక కార్యక్రమాలను చేపడుతుందని ఆర్జీ 2 జిఎంఎ.మనోహర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారి ఆధ్వర్యంలో సింగరేణి ఆర్జీ 2 జిఎం కార్యాలయం ఆవరణలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి రోజు ఒక విషయంపై అవగాహన కల్పించడంలో భాగంగా నీరు, ఎనర్జీపై అవగాహన కల్పించి, ఉద్యోగులచే పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిఎం ఎ.మనోహర్, అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇ.కనకజ్యోతి జిఎం ఆఫీస్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. సింగరేణి యాజమాన్యం నీటిని రిసైకిల్ చేసే విధానాన్ని ఏర్పాటు చేస్తూ ప్లాంట్లను నెలకొల్పడం జరుగుతుందని, సోలార్ విద్యుత్ తయారీలో ముందుకు సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో టిబిజికెఎస్ ఆర్జీ 2 ఉపాధ్యక్షులు ఐలి శ్రీనివాస్, ఎస్‌ఓటూజిఎం అబ్దుల్ సలీం, డిజిఎం పర్సనల్, అధికార ప్రతినిధి రాజేంద్ర ప్రసాద్, పర్యావరణ అధికారి సురేష్ బాబు, డిజిఎం సివిల్ ధనుంజయ, పర్సనల్ మేనేజర్ ఎస్.అనిల్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పి.వి.రమణ, ఇఇ సివిల్ వినయ్ సాగర్, ప్రతాపగిరి రాజు, డివైపిఎంలు వేణుగోపాల్, వంశీధర్, సీనియర్ పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, జిఎం ఆఫీస్ పిట్ సెక్రటరీ చిప్ప సత్యనారాయణ తదితరులున్నారు.

# రామగుండం నగర అధ్యక్షున్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**గోదావరిఖని, ప్రభాతవార్త.**



అనారోగ్యంతో బాధ పడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన కాంగ్రెస్ రామగుండం నగర అధ్యక్షుడు బొంతల రాజేష్‌ను ఏఐసిసి కార్యదర్శి, మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బుధవారం పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు తప్పకుండా పాటించాలని సూచించారు. రాజేష్ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. కాగా కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కీలక పాత్ర పోషించిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఈ సందర్భంగా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వారి వెంట కార్పొరేటర్లు, నాయకులు మహంకాళి స్వామి, గాదం నందు తదితరులున్నారు.

# ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలి

**ప్రభాతవార్త, ఇల్లందకుంట:**



ఇల్లందకుంట మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం హుజురాబాద్ ఆర్డీవో హరిసింగ్ సందర్శించి ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలను పరిశీలించి చేర్పులు, మార్పులు, తొలగింపుల గురించి తగు సూచనలు చేశారు. బిఎల్‌వోలు నూతన ఓటరు నమోదుకు ఫామ్6, చనిపోయిన వారిని తొలగించుటకు ఫామ్7, నివాసము లేని వారికి ఫామ్8 లను సేకరించాలని, అలాగే చనిపోయిన వారి మరణ ధృవీకరణ పత్రాలను కూడా సేకరించాలని సూచించారు. అంతేకాకుండా రోజువారి కార్యక్రమాలైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఇతర రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.మాధవి, నాయబ్ తహసీల్దార్ వరలక్ష్మీ, బిఎల్‌వో సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపునకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టుతున్నాం

**మంథని - ప్రభాతవార్త**



వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించటానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత మూలంగా జడ్పీ చైర్మన్ పుట్ట మధు నేతృత్వంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మంథని పాతపెట్రోల్ బంక్ సమీపంలో వచ్చిపోయే లారీలను ఆర్టీఏ, రెవెన్యూ అధికారుల సహకారంతో నిలిపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీటిని పుష్కలంగా అందించటంతో రైతులు అధికంగా పంటదిగుబడి సాధించారన్నారు. లారీల కొరత ఏర్పడిన నేపథ్యంలో దాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు హమాలీలు, మిల్లర్లు లారీ కాంట్రాక్టర్ల సహకారం తీసుకుని రైతులు పండించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించటానికి కృషిచేస్తున్నామని ఆయన తెలిపారు. మిల్లర్లు త్వరితగతిన లారీల నుండి ధాన్యాన్ని దిగుమతి చేసుకుని సహకరించాలన్నారు. రైస్‌మిల్లులలో స్థలం కొరత ఉన్నందున వెంకటాపూర్ పరిసర గ్రామాల ధాన్యాన్ని వెంకటాపూర్ గోదాంలో నిల్వ ఉంచే విధంగా చూస్తామన్నారు. వాతావర్ణం అనుకూలించని పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో రైతులకు అన్ని రకాలుగా తాము అండగా ఉంటామని తెలిపారు. సహకార సంఘం పాలకవర్గ సభ్యులు అన్నదాతకు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, తహసీల్దార్ బండి ప్రకాశ్, డిటి గిరి, ఆర్ఐ రాజబాబు, మోటర్‌వెహికిల్ ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్, సిఐవో మామిడాల ఆశోక్‌కుమార్‌తో పాటు సహకారసంఘం డైరక్టర్లు పాల్గొన్నారు.

# సర్పంచ్‌ని పరామర్శించిన బిఆర్ఎస్ నేతలు

**తంగళ్లపల్లి, ప్రభాతవార్త :**

తంగళపల్లి మండలంలోని దేశాయిపల్లె గ్రామ సర్పంచ్ నకీర్తి బాలమల్లు తండ్రి కుంటయ్య ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని బుధవారం మండల బిఆర్ఎస్ నేతలు పరామర్శించారు. సర్పంచ్‌ను పరామర్శించిన వారిలో మాజీ ఏఎంసి చైర్మన్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గజబింకార్ రాజన్న, మండల ఉపాధ్యక్షుడు ముత్యంరెడ్డిలు తదితరులు ఉన్నారు.

# డాక్టరేట్‌కు ఎంపికైన టిబిజికెఎస్ ఎఎల్‌పి పిట్ సెక్రటరీ జక్కుల దామోదర్

**యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త.**

యైటింక్లయిన్‌కాలనీలో నివాసముండే టిబిజికెఎస్ ఆర్జీ 3, ఎఎల్‌పి బ్రాంచి సెక్రటరీ జక్కుల దామోదర్ డాక్టరేట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసర్చ్ యూనివర్శిటీ వారు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

# హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు టీకా వ్యాక్సిన్

కాగజ్‌నగర్ , ప్రభాతవార్త :






కాగజ్‌నగర్ హజ్ సొసైటి ఆధ్వర్యంలో పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం కుమ్రం భీం జిల్లా హజ్ 2023 సంవత్సరంనకు వెళ్లే యాత్రికులకు టీకా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, కరీంనగర్ ఎంఐఎం అధ్యక్షులు,సెంటర్ హజ్‌కమిటి సభ్యులు అహ్మద్ హుస్సేన్, కేంద్ర హజ్‌కమిటి శిక్షకులు అల్-హజ్ ఆరిఫ్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హజ్ యాత్రికులు టీకా ఖచ్చితంగా వేసుకోవాలని యాత్రికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరింగా వివరవించారు. ప్రభుత్వం నుండి ఎంపికైన ఆసిఫాబాద్ జిల్లా 48 మంది పురుషులు, మహిళలు హజ్‌యాత్రకు వెళ్లనున్నట్లు వారు తెలిపారు. అదే విధంగా హజ్‌యాత్రికులకు మెడికిట్‌లు, బ్యాగ్‌లు, తదితర సామాగ్రి పంపిణి చేశారు. వారికి యాత్రకు వెళ్లవల్సిన సూచనలు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం, హజ్‌కమిటి సొసైటి ప్రధాన కార్యదర్శి ముఫకం అహ్మద్, హఫీజ్ రియాజ్, షాకీర్, మీర్ సాబీర్ అలీ హాష్మీ, డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ కౌసర్, సబ్ యూనిట్ ఆఫీసర్ అనిసుద్దీన్, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుతో మెరుగుపడనున్న సేవలు

జైనూర్, ప్రభాతవార్త :



జైనూర్ మండలంలోని మార్లవాయిలో బీఎస్ఎన్ఎల్ టవర్ పనులు త్వరగా పూర్తిచేసి కమ్యూనికేషన్ సేవలు మెరుగు పడనున్నాయని మార్లవాయి సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్‌రావు వైస్‌ఎంపీపీ లక్ష్మణ్ యాదవ్ అన్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు మార్లవాయిలో టవరన ఏర్పాటుకు బుధవారం రావడంతో టవర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పంచాయతీలో బీఎస్ఎన్ఎల్ ఇతర మొబైల్ టవర్ లేక కమ్యూనికేషన్లు చాలా ఇబ్బందులు పడ్డామని మొబైల్ టవర్ ఏర్పాటు చేయాలని అధికారులకు ప్రజా ప్రతినిదులకు ఎన్నోసార్లు విన్నపించినా అందరి సహకారంతో బీఎస్ఎన్ఎల్ అధికారులు ముందుకు వచ్చి టవర్ మంజూరు చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. నేటి కాలంలో మొబైల్స్ నెట్‌వర్క్ సేవలు కీలకపాత్ర పోషించే రోజుల్లో మేము సంవత్సరాల తరబడి ఎన్నో ఒడిదొడుకులు సాధనక బాధలు పడ్డామని సర్పంచ్‌తో పాటు నాయకులు , ప్రజలు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్ యాదవ్, ఎస్ఐ మధూకర్, జుగునకదేవ్‌రావు, నాయకులు గణపతి, సోయం రాజు, చందు, హన్ను,లచ్చు , సోనేరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఈస్‌గాం శివమల్లన్న స్వామి దేవాలయ వార్షికోత్సవం

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :









కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం శివమల్లన్న స్వామి దేవాలయ 44వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభించి ఉదయం 9 గంటల నుండి 4 గంటల వరకు మహాన్యాస పూర్వక రుద్రాబిషేకం, శ్రీ కాలభైరవ స్వామి, శ్రీ వీరభద్రస్వామి, శ్రీమహాకాళీ, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీనందికేశ్వరస్వామి, అభిషేకాలు రుద్రహవచనము పంచసూక్త హవనములు పూర్ణహుతి మహాదాశీర్వచనలతో పాటు ప్రత్యేక పూజలు వేద పండితులు నరహరి శర్మ, ఆలయ అర్చకులు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు అవధూత శర్మ, వేణుగోపాల శర్మ, అనురాగ్ శర్మ ద్వారా నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి పాల్గొని ప్రత్యేక పూజలు పాల్గొని ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమంలో పాల్గొన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాదం పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా, ఆలయ చైర్మన్ ఇందారపు రాజేశ్వర్‌రావు, ధర్మకర్త మంలి సభ్యురాలు మామిడాల మమత, ప్రకశాంత్, బ్రాహ్మ సంఘ అద్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి సంధ్యారాణి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 100మీటర్ల రన్నింగ్‌లో గోల్డ్ మెడల్

ఇనుగుర్తి, మే 24,ప్రభాతవార్త

ప్రభుత్వం నిర్వహిస్తున్న సిఎం కప్ క్రీడల్లో మండలంలోని అయ్యగారిపెల్లికి చెందిన భూక్య అనీల్ 100మీటర్ల రన్నింగ్‌లో గోల్డు మెడల్ సాధిం చారు. గోల్డు మెడల్ సాధించడం పట్ల ఇంటర్నేషనల్ బ్యాడ్మిం టన్ రెఫరీ, జడ్పిఎచ్ఎస్ పిఈటి కొమ్ము రాజేందర్‌తోపాటు ఇనుగుర్తి గ్రామ సర్పంచ్ దార్ల రాంమూర్తి, అయ్యగారిపల్లి సర్పంచ్ మామిడి శోభన్‌బాబుతోపాటు పలువురు అభినందిస్తున్నారు



కుమురంభీం ఆసిఫాబాద్ వార్త

# జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్దీకరణపై హర్షం

ఆసిఫాబాద్ రూరల్, ప్రభాతవార్త :



రాష్ట్రంలో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్దీకరణపై ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జేపీఎస్ నాయకులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు సీఎం కేసిఆర్ తిపికబురు అందించారని, జేపీఎస్ సర్వీసును క్రమబద్దీకరించాలని నిర్ణయించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం కేసిఆర్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేకు జిల్లా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేపిఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు, జిల్లా కమిటి సభ్యులు హరీష్, లావణ్య, దివ్య, ప్రవీణ్, రోహిదాస్, నాగేష్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ కళాశాలలో ఇంటర్ దరఖాస్తులకు నేడు చివరి రోజు

ఆసిఫాబాద్ రూరల్, ప్రభాతవార్త :

జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేయుటకు గడువు గురువారం రోజు 25వ తేదీన ముగుస్తుందని ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఇంటర్ ప్రథమక సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో గ్రూపుకు 40 చొప్పున మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి సాధించిన మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం ఎంపిక ఉంటుందని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఎటువంటి దరఖాస్తు రుసుము లేకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని పదో తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# కల్వరి ఫెయిత్ చర్చి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు

సిర్పూర్(టి), ప్రభాతవార్త :




సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని కల్వరి ఫెయిత్ చర్చి ఫాస్టర్ కీర్తి కుమార్ ఆధ్వర్యంలో సేవా భారత్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ సుధాకర్, డాక్టర్ విద్యాసాగర్‌లతో కలిసి బుధవారం రోజున స్థానిక చర్చిలో ప్రజలకు ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య పరిస్థితులపై జాగ్రత్తగా ఉండాలని పరిశుభ్రత కలిగి ఉండాలని మనం ఎంత పరిశుభ్రంగా ఉంటామో మన ఇంటిని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. మెడికల్ క్యాంపులో పాల్గొన్న 200 మంది జనరల్, జ్వరం, దగ్గు జలుబు , తలనొప్పి వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని ఉష్ణోగ్రత పెరుగుతున్న సందర్భంగా ఎండ దెబ్బ తగలకుండా తగు జాగ్రతగా ఉండాలని మందులు ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలి

**రాష్ట్ర పౌరసరఫరాలు వెనుకబడిన, తరగతుల సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్**

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో ,ప్రభాతవార్త :






రైతుల సంక్షేమం అభివృద్ధి కొరకు ప్రభుత్వమే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుకలు ఎలాంటి నష్టం జరగకుండా మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి పౌరసరఫరాల శాఖ చైర్మన్ రవీందర్ సింగ్ ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిశాఖల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అనంతరం ఈ ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా త్రాగునీరు, నీడ, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో పాటు వృద్దులు, దివ్యాంగు రైతులకు ప్రాధాన్యత ఇస్తూ ముందుగా వారి నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి పంట సాగు చేసే మండలాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తూకం అయినా వాటిని వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గన్ని సంచులను సరఫరా చేయడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు త్వరలో దిగుమితి చేసే విధంగా అధికారులన సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని , వడ్ల సేకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్, సహకార వ్యవసాయశాఖ అధికారులు, ఐకేపి అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులంటే...అధికారులు కనీసం స్పందించడం లేదు

**-అలాంటప్పుడు ఈ సమావేశంలో మేమెందుకు ?**
**-మండల సర్వసభ్యసమావేశంతో అయ్యేది లేదు,పొయ్యేది లేదు**
**-మండల సభ అంటే ఒక్క అధికారికి భయం లేదని మండల సభలో ప్రజాప్రతినిధుల ఆవేదన**

నెల్లికుదురు, మే 24, ప్రభాతవార్త



ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంను బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎర్రబెల్లి మాదవి నవీన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం మొదలౌతుండగానే తాము కార్యాలయానికి వెళ్తె ఏఒక్క అధికారికూడ కనీసం ప్రజాప్రతినిధులనే విషయాన్ని మరిచి నిర్లక్ష్యం వహిస్తున్నారనీ...మాకు ఓట్లేసి గెలిపించిన ప్రజలకు కనీసం కులం,ఆదాయం దృవీకరణ పత్రాలను కూడ తీపించి ఎన్నుకున్న ప్రజలకు ఇచ్చి పరిస్థితి లేదని, ఎంపిటీసిగా ఫోన్ చేస్తె తహాశీల్దార్ కార్యాలయంలో లిప్టచేసె పరిస్థితి లేదని మండలంలోని నర్సింహుల గూడెం ఎంపిటీసి వేశాల క్రిష్టయ్య సభలో తన గోడు వెళ్ళబుచ్చిన సంఘటన చోటుచేసుకోగా వేధికపైన్నే ఉన్న వైస్ ఎంపిపి జెల్ల వెంక టేష్ తహాశీల్దార్ కార్యాలయం తరుపున సమావేశానికి వచ్చిన డిప్యుటి తహాశీల్దార్‌ను ఫోన్‌లు ఎందుకు లిప్ట చేసి సమాదానం చెప్పరని నిలదీశారు.ఇకనైన ప్రజాప్రతినిధులను గుర్తించి సమాధానం ఇవ్వండని సూచించారు.అనంతరం పలుశాఖల వారిగా సమీక్షా సమావేశం నిర్వహించగా విద్యుత్,డబుల్‌బెడ్‌రూండ్ల విషయాలపై సంబందిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.సమావేశం పూర్తివ్వకముందే మండల సర్వసభ్యసమావేశంతో అయ్యేది లేదు,పొయ్యేది లేదని,మండల సభ అంటే ఒక్క అధికారికి భయం లేదని ఆరోపిస్తూ ప్రజాప్రతినిధులు వెళ్ళిపోతున్న పరిస్థితి దాపురిచిందంటే ప్రజాప్రతినిధుల్లో ఎంత ఆవేదన ఉందో దీనిని బట్టి అర్ధం చేసుకోవచ్చు.మండల సభకు రాని అధికారులపై,ప్రజాప్రతినిధులంటే నిర్లక్ష్యంగా వ్యవహిరించే అధికారుల పట్ల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తుండగా, మండల సభ జరుగుతున్న తీరుపై మండల ప్రజలు ఆగ్రహాం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిడిఓ శేషాద్రీ,డిప్యుటి తహాశీల్దార్, వైస్ ఎంపిపి జెల్ల వెంకటేష్,ఎంపిటీసిలు వేశాల క్రిష్టయ్య, వెన్నాకుల వాణిశ్రీనువాస్, కదిరే జగన్,దూడమ్మ,సుభాషిణి,మదన్‌లాల్ సర్పంచ్‌లు బీరవెళ్ళి యాదగిరిరెడ్డి,కొమ్ము అనీల్,గాయపు జయపాల్ రెడ్డి,బీముడు, మంగ్యా,ఉబ్బని అనీల్,పరమేశ్వర్ లతోపాటు వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మెడికల్ సీటు సాధించిన విద్యార్థినిని అభినందించిన చల్లా

మంథని రూరల్ - ప్రభాతవార్త



మంథని మండలం పుట్టపాక గ్రామానికి చెందిన చాట్లపల్లి నవ్య ఎంబిబిఎస్ ఫలితాల్లో 1291ర్యాంకు సాధించి మెడికల్ సీటు దక్కించుకున్నందుకు బుధవారం నవ్యను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కాటారం సింగిల్‌విండో చైర్మన్ చల్లా నారాయణరెడ్డి అభినందించారు. పేదింటికి చెందిన నవ్య కష్టపడి మెడికల్ సీటుసాధించటం ఎంతో అభినందనీయమన్నారు. మంచి డాక్టర్‌గా పేరుసంపాదించి పేదవారికి వైద్యం అందుబాటులోకి తీసుకరావాలని ఆయన కోరారు. ఆయన వెంట స్థానిక ఉపసర్పంచ్ మిట్ట శంకర్, మాజీ జడ్పీటీసీ దుర్గం మల్లయ్య, రమేశ్, వేణు పాల్గొన్నారు

# ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**-మున్సిపల్ కమీషనర్**

మెట్‌పల్లి అర్బన్ - ప్రభాతవార్త :

రాబోయే వర్షకాలం దృష్ట్యా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమీషనర్ జగదీశ్వర్‌గౌడ్ సూచించారు. బుధవారం పట్టణంలోని 12వ, 16వ వార్డులలో జరుగుతున్న స్పెషల్ సానిటేషన్ పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమీషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెయిన్ డ్రైన్స్, మురికి నాళాలను జెసిబి ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించినట్లు తెలిపారు. అదనంగా పారిశుద్ధ్య సిబ్బంది ఏర్పాటు చేసి వార్డులలో మురికి కాలువలు అడుగు నుండి తీయాలని సూచించారు. ప్రజలందరూ చెత్తను ఇంటి వద్దనే తడి, పొడిగా వేర్వేరు చేసి ఆయా వార్డులకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలనితెలిపారు. దుకాణ యాజమానులు వారి సామాన్లు రోడ్డుపై పెట్టి ప్రజలకు ఇబ్బంది కల్గించినచో కఠిన చర్యలు తీసుకోబడునని తెలిపారు. అలాగే రోడ్లపై ప్రచార బోర్డులు ఏర్పాటు చేసినచో తొలగించబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముజిబ్, వార్డు ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు

## ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్

# రూట్ కాస్ అనాలసిస్‌పై శిక్షణా తరగతులు

**- ప్రారంభించిన సింగరేణి ఆర్జీ 2 జిఎం**

యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త.




సింగరేణి స్థాయిలో ఎంపిక చేసిన ఏజంట్లు, ఏరియా రక్షణ అధి కారులు, మెన ఏజర్లు, రక్షణ అధికారులు, డిప్యూటీ మేనేజర్లకు, ఎలక్ట్రికల్ సేఫ్టీ అధి. కారులకు ప్రమాదాలు జరుగు కారణాలపై విశ్లేషణ (రూట్ కాస్ అనాలసిస్) పై రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభం అయ్యాయి. ముఖ్య అతిథిగా ఆర్జీ 2 జిఎం ఎ.మనోహర్ హాజరై ఈ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులను రామగుండం రీజియన్, కొత్తగూడెం రీజియన్లలో పని చేస్తున్న ముఖ్య అధికారులకు మూడు బ్యాచ్‌లుగా ఈ నెల 30 వరకు శిక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఒక నిర్దిష్టమైన విధానంలో అంతర్గతంగా ప్రమాణాలకు అనుగుణంగా సింగరేణిలో ఉన్న అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో ప్రమాదాలను విశ్లేషించి, నివారణ చర్యతు తీసుకోవడానికి సింగరేణి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి ఈ శిక్షణ తరగతులు దోహద పడుతాయని జిఎం మనోహర్ అన్నారు. కార్యక్రమంలో డిజిఎం ఎస్ఎంటిసి ఎకెకె శర్మ, ఎస్ఓఎం ఎస్ఎంటిసి విజయ్‌కుమార్, అన్ని ఏరియాల నుంచి హాజరైన అధికారులున్నారు.

# బిజెపి యువనాయకుడు సురభి నవీన్‌కు ఘన సన్మానం

ఇబ్రహీపట్నం - ప్రభాతవార్త :



ఇబ్రహీపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో బిజెపి నియోజకవర్గ నాయకుడు సురభి నవీన్‌కుమార్‌ను బుధవారం ఘనంగా శాలువతో సన్మానించారు. కాగా ఎంపి అర్వింద్ నిధుల నుంచి రూ.3లక్షల 54వేల నిధులను గ్రామంలో అభివృద్ధి పనులకు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సురభి నవీన్‌కు ఘన సన్మానం చేశారు. జనంలో మమేకమవుతూ ప్రజా సమస్యలపై బిజెపి యువ నాయకుడు సురభి నవీన్ పోరాడాతున్నారాని తెలిపారు.అనంతరం గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సురభి నవీన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేములకుర్తి గ్రామ ప్రజలు, ఎస్సి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, విడిసి అధ్యక్షుడు వెంకటాద్రి, సభ్యులు అడువాల రాము, ఎల్ల శంకర్, బిజెపి నాయకులు మాలెపు శ్రీనివాస్, రాజరెడ్డి, వెంకటస్వామి, నరేంధర్, భర్మ నగేష్, నవీన్, గిన్నెల ఆశోక్, దామ శ్రావణ్, గుంటుక నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదానికి గురైన లారీ

గొల్లపల్లి,ప్రభాతవార్త :

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేటలో లారీ అగ్ని ప్రమాదానికి గురైంది. మెట్‌పల్లి నుండి మల్లన్నపేటకి ఎండు గడ్డి లోడుతో వస్తున్న లారీకి ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి షార్ట్ సర్క్యూ ట్‌తో మంటలు చెలరేగాయి.గడ్డితో సహా లారీ దగ్దమైంది.వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలార్పారు.

# ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

**జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ**

సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త



జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని జిడ్పి చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా స్టాడింగ్ కమిటి సమావేశాలను జడ్పి కార్యాలయంలో జడ్పి చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పి చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత ట్రాన్స్ పోర్ట్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సిరిసిల్ల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అధికారులు ప్రజాప్రతి నిధులు భాగస్వామ్యంతో ప్రభుత్వ పథకాలను అందేలా కృషి చేయాలని అన్నారు. జిల్లాలో పాడి అభివృద్ధికి విశేష అవకాశాలు ఉన్న దృష్ట్య అర్హులకు పాడి గేదెలు అందేలా చూడాలని అన్నారు. యూనిట్లు అందజేసే ముందు వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తే లాభాలు సోంతం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. వ్యవసాయ సాంప్రదాయ పద్దతుల నుంచి బయటపడుతూ పంట మార్పిడి దృష్టి సారించి వ్యవసాయ అనుబంద రంగాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మన్ సిద్ధం వేణు, తంగళపల్లి జడ్పిటిసి పూర్మాణి లింగారెడ్డి, బోయినపల్లి జడ్పిటిసి కత్తెరపాక ఉమ, గట్ల మీనయ్య, మ్యాకల రవి, గుగులోత్ కళావతి, తదితరులు జడ్పి సిఈవో గౌతం రెడ్డి పాల్గొన్నారు.

## జిల్లెల్లలో కార్మికులకు ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం

తంగళపల్లి, ప్రభాతవార్త :



తంగళపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామంలో తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్మికుల కోసం నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య పరీక్షలు వైద్య శిబిరాన్ని జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ లేబర్ కార్డు కలిగి ఉన్న భవన నిర్మాణ కార్మిక సోదరులకు 50 రకాల పరీక్షలు ఉచితంగా చేయడం సంతోషకరమని అన్నారు. ఈ అవకాశాన్ని కార్మికులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి అండగా నిలిచిన జిల్లా యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు

**- రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేత**

తంగళపల్లి, ప్రభాతవార్త :




అరుదైన వ్యాధితో కాళ్ళు చచ్చుబడిపోయి మంచానికే పరిమితమైన తంగళపల్లి మండలంలోని మండేపల్లి గ్రామానికి చెందిన కాసాని భానుప్రసాద్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ఎంపిటిసి బుస్స స్వప్న-లింగం చొరవతో భాను ప్రసాద్‌కు జిల్లా యాదవ సంఘం గౌరవ అధ్యక్షుడు జెగ్గాని మల్లేశం యాదవ్ మంగళవారం రాత్రి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి స్వప్న లింగములు మాట్లాడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం భాను ప్రసాద్‌కు సాయం అందించిన మల్లేశం యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భాను వైద్యానికి సుమారు ఆరు లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని హైదరాబాద్ ఆసపత్రి వైద్యులు తెలిపారు అన్నారు. ఎవరైనా దాతలు భాను ప్రసాద్‌కు ఆర్థికసాయం అందజేయాలనుకుంటే 9700700755 నెంబర్ ద్వారా సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బుస్స స్వప్న-లింగం, జిల్లా నాయకులు బొబ్బాల మల్లేశం యాదవ్, జగ్గాని జలెందర్ యాదవ్, గాదం సురేష్ యాదవ్, శివ, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## అనాధ వృద్ధురాలు మృతి

**-చందాలతో అంత్యక్రియలు నిర్వహించిన స్థానికులు**

కోనరావుపేట, ప్రభాతవార్త



కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో సింగిడి దేవవ్వ(83) అనే అనాధ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసుల, స్థానికులు కథనం ప్రకారం..దేవవ్వకు ఎవ్వరూ లేరని,



కొద్ది రోజులుగా అనారోగ్యం బారిన పడిన వృద్ధురాలు రెండు రోజులుగా ఇంటి తలుపు తీయలేదు. అనుమానం వచ్చిన చుట్టు ప్రక్కల వారు అనుమానంతో ఇంటి తలుపులు చూసేసరికి దేవవ్వ విగితా జీవిగా పడిఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. దేవవ్వ మృతి పై ఎటువంటి ఫిర్యాదు స్థానికులు ఇవ్వలేదని ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దేవవ్వ అంత్యక్రియలకు స్థానికులు చందాలు పోగు చేసి కార్యక్రమం నిర్వహించారు.

## బిజెపి బలోపేతానికి కృషిచేయాలి

**- జిల్లా అధ్యక్షులు రామకృష్ణ**

చందుర్తి, ప్రభాతవార్త :



బిజెపి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలని బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలో బుధవారం బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశంజరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ రానున్న కాలం బిజెపి పార్టీకి చాలా చాలా ముఖ్యమైనది, బిజెపి రాష్ట్ర, కేంద్ర నాయకత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంతో విస్తృతంగా ప్రజల్లోకి మరింతగా చొచ్చుకొని పోవాలని, రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లో రాక్షస ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిందేనన్నారు. టిఆర ఎస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, ప్రజల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందని రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతుందన్నారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ఇంచార్జి గంగాడి మోహన్‌రెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, పార్లమెంట్ కోకన్వీనర్లు క్యాతం దశరథరెడ్డి, ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు రేగుల మల్లికార్జున్, రెడ్డబోయిన గోపి, వేములవాడ ఎంపీపీ బండ మల్లేశం, అసెంబ్లీ కన్వీనర్‌లు మార్త సత్తయ్య, కరెడ్ల మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, చందుర్తి మండల అధ్యక్షులు పొంచెట్టి రాకేష్, మండల ప్రధాన కార్యదర్శులు చింతకుంట గంగాధర్, చిర్రం తిరుపతి నాయకులు పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వ విజయాల పుస్తకం అందజేత

వేములవాడ, ప్రభాతవార్త :



దేశ ప్రధాని నరేంద్ర మోడీ 9 ఏళ్ల పాలనలో ప్రభుత్వ విజయాలపై రూపొందించిన పుస్తకాన్ని వేములవాడ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మనోహర్‌కు జిల్లా బిజెపి అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్‌రావు, బండ మల్లేశం, బాలరాజు ఉన్నారు

## ఆపదలో అండగా నిలిచిన స్నేహితులు

**- మిత్రుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేత**

తంగళపల్లి, ప్రభాతవార్త :



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మిత్రుని కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. ఈ మేరకు తంగళపల్లి మండలంలోని దేశాయ్‌పల్లె గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాల్‌రెడ్డి కుటుంబానికి అతని మిత్రులు బుధవారం ఆర్థికసాయం అందజేశారు. తమ ఆప్త మిత్రుడి అకాల మరణంతో ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు సోషల్ మీడియా ద్వారా వారు సేకరించిన రూ.53000 వేల ఆర్థికసాయాన్ని జిల్లా రజక సంఘం అధ్యక్షుడు దుబ్బాక రమేష్, చిన్నలింగాపూర్ ఎంపిటిసి బైరినేని రాము, వెగ్గళం శ్రీనులు బాల్‌రెడ్డి కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇద్దరు చిన్న ఆడపిల్లలు ఉన్న నిరుపేద అయిన బాల్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఏరియా ఆసుపత్రిలో ఒకేరోజు పది సాధారణ కాన్పులు

వేములవాడ, ప్రభాతవార్త :



వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ఒకేరోజు 10 సాధారణ కాన్పులు చేయగా, ఇందులో ఆరుగురు మగ పిల్లలు, నలుగురు ఆడ పిల్లలు జన్మించినట్లు ఆసుపత్రి సూపరిండెంట్ మహేష్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెలివరీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బందిని అభినందించారు. మొదటి కాన్పులో నార్మల్ డెలివరీ అయి ఆడబిడ్డ జని మ్మస్తే ఉయ్యాల అందజేస్తున్నట్లు తెలిపారు. వేములవాడ, చుట్టుపక్కల మండలాల ప్రజలు ఏరియా ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైత్య సుధ, సంతోష్‌చారి, తిరుపతి, బింధు, జ్యోతి, ఆఫీస్ సూపరిండెంట్ నాగరాజు, హెడ్ నర్స్ స్టెల్లా, స్టాఫ్ నర్స్ భాగ్యలక్ష్మి, లక్ష్మిదేవరకొండ, అరుణ సాయి, జ్యోతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జూన్ 12న ఆమరణ నిరాహార దీక్ష

**బేల, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో బీమ్ ఆర్మీ సంవిదాన్ రక్షక్ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నింసాత్కర్ ప్రశాంత్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మండలంలోని ఖోగ్దూర్ గ్రామంలో దళితు లపైన జరుగుతున్న దాడులపైన అధి కారులు ఇటు ప్రజాప్రతినిధులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. గ్రామంలో నివసించే హక్కు తమకు ఉందని, దీనికి సంబంధించిన పూర్తి ఆధారాలు తమ దగ్గర ఉందనని పేర్కొన్నారు. తమకు ఊరుతో ఎలాంటి



గొడవలు లేవని కేవలం కొందరు వ్యక్తులు తమను ఊరి నుంచి బహిష్కరిస్తున్నారు. దీనిపైన పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేవని పేర్కొన్నారు. ఈవిషయంపై అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించు కోకపోవడంతో తమకు న్యాయం ఎవరు చేస్తారని ప్రభుత్వానికి కోరారు. ఖోగ్దూర్ గ్రామంలో వ్యవసాయంతో పాటు సొంత ఇండ్లు ఉండి కూడా బయట అద్దె ఇంట్లో తాము నివసిస్తున్నామని దళితులకు రాజ్యాంగ కల్పిస్తున్న హక్కు ఇదేనా అని ప్రశ్నించారు. వెంటనే అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని దళితు లపైన జరుగు తున్న దాడులను అరికట్టి న్యాయం జరిగేలా చూడాలని, లేని యెడల జూన్ 12న ఆమరణ దీక్ష చేపడుతామని హెచ్చ రించారు. ఈకార్యక్రమంలో సుధాకర్, మేస్రం కిరణ్ పాల్గొన్నారు.

## ఆలయాల నిర్మాణ పనులకు భూమిపూజ

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :**



నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని విఠాపూర్ గ్రామంలో గ్రామ సేవతల ఆలయాల నిర్మాణ పనులకు బుధవారం ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.18 లక్షల రూపాయలతో సిజిఎఫ్ నిధులతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేసి ప్రారంభించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హయాంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గంగామణి బుచ్చన్న, పిఎసిఎస్ చైర్మెన్ సట్ల గజ్జారాం, సర్పంచ్ లక్ష్మి రమేష్, ఎంపిటిసి మధు, విడిసి అధ్యక్షులు సి.హెచ్.అశోక్, ఉప సర్పంచ్ నవీన్ రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మెన్ కిష్టయ్య, వార్డు మెంబర్‌లు, విడిసి సభ్యులు, గ్రామస్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రణాళికంగా పారిశుధ్య పనులు చేపడుతాం

**ఆసిఫాబాద్ రూరల్, ప్రభాతవార్త :**



ఒక ప్రణాళికతో పారిశుధ్య పనులను చేపడతామని ఇంచార్జి డీపిఓ, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి సురేందర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని అన్ని మురుగు కాలువలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని రోడ్డు డివైడర్ మధ్యలో ప్రజల ఆరోగ్యానికి హానిని కలిగించే చెట్లు పెరగడంతో వాటిని తొలగించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో దశలవారిగా పలు మురుగు కాలువల నిర్మాణాన్ని, కల్వర్టులను చేపడతామని వెల్లడించారు. ఎల్లవేళలా తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చేస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సమకరించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులు, ఖర్చుల వివరాలను ప్రజలకు చదివి వినిపించారు. గ్రామ సభలో ప్రజలు కొన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రాజంపేట గుండి రోడ్డులో విద్యుత్ ఓల్టేజ్ తక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలోని బజార్ వాడీ అంగన్‌వాడీ కేంద్రం 1లో కొత్తగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని, బజార్ వాడిలోని మసీదు వద్ద కొద్ద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు గానీ వాటికి వైర్లు అమర్చలేదని, తదితర సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ గ్రామ సభలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ , సిబ్బంది సంతోష్, స్థానిక ప్రజలు అంగన్‌వాడీ టీచర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సీఎం కాప్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన నీలగిరి సాయిమిత్ర


**ఆదిలాబాద్, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారుల ప్రోత్సహించేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ పోటీలకు ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రానికి చెందిన సాయి మిత్ర ఎంపికైంది. ఈనెల 27నుంచి రాష్ట్రస్థాయిలో నిర్వహించే సీఎం కప్ బ్యాట్మెంటల్ సింగల్ డబుల్ పోటీలకు ఎంపికైంది. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో నీలగిరి సాయి మిత్ర పాల్గొని సింగల్ డబుల్ స్లోను సత్తా చాటారు. జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన సాయి మిత్రమాను క్రీడలఅధికారి వెంకటేశ్వర్లు సీఎం కప్ సర్టిఫికెటలతో పాటు బంగారు పథకాలను అందజేసి అభినందించారు. ఇది స్పూర్తితో రాష్ట్రస్థాయిలో రాణించే జిల్లా పేరు నిల్పాలని కోరారు. అదేవిధంగా కోచ్‌లు కబీ దాస్ స్వామిలు రాజేశ్వర్లు వీరిని అభినందించారు. తలమడుగు మండలం నుంచి జిల్లా స్థాయి రాష్ట్రస్థాయిలో రాణించినందుకు సాయి మిత్రులను తహసీల్దార్ వనాజారెడ్డి, ఎంపీడీఓ రమాకాంత్ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి, రాజేశ్వర్ తలమడుగు సర్పంచ్ కర్ణకర్ రెడీలు అభినందించారు.

## సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :**



నిర్మల్ జిల్లా భైంసా మండల కేంద్రంలోని ఎంఆర్‌వో కార్యాలయంలో బుధవారం రోజు ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ఉద్యోగులను రెగ్యులర్ చేసినందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోలంకి భీమ్‌రావు, చౌహాన్ శంకర్, నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, కుంటాల జడ్పిటిసి గంగామణి బుచ్చన్న, వైస్ ఎంపిపి గంగాధర్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు గజానన్, కుబీర్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు దత్తుగౌడ్, మండల సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సెత్వారీ సర్వేపూర్తి చేయాలని మంత్రికి విన్నపం

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :**



నాలుగు దశాబ్దాలుగా అమలుకాని గ్రామ సేతువారి సమస్య కోసం బుధవారం న్యూవెల్మల్ గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని, జిల్లా పాలనాధికారి వరుణ్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు మాట్లాడుతూ గ్రామానికి సేత్వారి చేయకపోవడం వలన దాదాపుగా ఒక 150 మంది రైతులు 200 ఎకరాలకు పట్టాపాస్ పుస్తకాలు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలైన రైతుబంధు, రైతుభీమా, రైతు రుణమాఫీ, కనీసం ఆ రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి అనర్హులుగా ఉన్నారన్నారు. గతంలో మంత్రి ఆదేశానుసారం సోన్ మండల తహసిల్దార్ ఆధ్వర్యంలో సర్వేయర్లతో గ్రామంలో అన్ని వ్యవసాయ భూములను తిరుగుతూ 80 శాతం సర్వే పూర్తి చేయడం జరిగింది. మిగతా సర్వేను పూర్తిచేయాలని మంత్రికి తెలియజేయడం జరిగింది. దీనికి వారు సానుకూలంగా స్పందించి సాధ్యమైనంత త్వరలో గ్రామానికి సేతువారి అమలుచేసి అందరికీ పట్టాపాస్‌పుస్తకాలు అందేలా చూస్తామని హామీనిచ్చారు. ఇందులో గ్రామాభివృద్ధి కమిటి అధ్యక్షులు రెమ్మాయి సాగర్, కోశాధికారి కొండారవి, మాజీ సర్పంచ్‌లుల రోడ్డు రాజేశ్వర్,తోట సాయన్న, ఎలుగు రాజలింగం, వి.నర్సింగ్‌రావు, మెట్టు గంగాధర్, గొడుగు భూమేష్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :**



నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ముధోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ 113 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఇంతపెద్ద ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే సీఎం కేసీఆర్ అందజేయడం జరుగు తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలకు ఒక వరంలాంటిదని, ఈ సహాయం ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో డిపిఓ లక్ష్మి, తహసిల్దార్ వి.విశ్వంబర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గంగా చరణ్, వైస్ ఎంపిపి మొహినొద్దిన్, తెరాసా జిల్లా నాయకులు తూము రాజేశ్వర్, కుభీర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మీరా విజయ్ కుమార్, ఆయా గ్రామాల జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వార్త కథనానికి స్పందన

### -పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు

**ఆదిలాబాద్, ప్రభాతవార్త:**




ఈనెల 8న వార్త దినపత్రికలో 'శిథిలావస్థలో.. ఆస్పత్రి భవన' కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. ప్రజాప్రతినిధులు స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను మొదలు పెట్టారు. వార్త దినపత్రికలో వచ్చిన వార్తను చూసి స్పందించినందుకు వందనాలు తెలిపారు. ఇప్పటి వరక ఆలస్యం అయ్యింది కానీ ఇక నుంచి అయినా పనులు వేగవంతంగా చేస్తూ ఆస్పత్రి భవనాన్ని త్వరలో పూర్తి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

